క్లుప్తంగా

విద్యుత్ స్తంభం ఏర్పాటు



కురవి : సీరోలు మండలం ఉప్పరిగూడెంలో ఓ రైతుకు చెందిన చేనులో విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతున్న చోట విద్యుత్ శాఖ అధికారి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేశారు. ఈనెల 30న 'సాక్షి'లో 'కర్రలే ఆధారం' అనే శీర్షికన కథనం ప్రచురితం కావడంతో స్పందించిన సీరోలు మండల విద్యుత్ శాఖ అధికారులు బుధవారం విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేశారు.

సాక్షి ఎఫెక్ట్..

నియామకం



సోమేశ్వర్‌రావు

తొర్రూరు : కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ అధికార ప్రతినిధిగా ముత్తినేని సోమేశ్వర్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ అధికార ప్రతినిధి సుజాత పాల్ నియామక పత్రాన్ని అందజేశారు. తన నియామకానికి సహకరించిన జనగామ జిల్లా డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ కత్తి వెంకటస్వామికి ముత్తినేని కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థినికి అభినందన



మహబూబాబాద్ రూరల్ : ఈదులపూసపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని లావుడ్యా నిఖిత పదోతరగతిలో 10/10 సాధించింది. ఈసందర్భంగా భగత్ సింగ్ స్టడీ సర్కిల్, స్ఫూర్తి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం సన్మానించి అభినందనలు తెలిపారు. క్లెం వీరారెడ్డి, రామసహాయం శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలకు తమవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. లావుడ్యా నిఖితకు రూ.5 వేల నగదు అందజేసి శాలువాతో సత్కరించారు.

ఆర్థికసాయం



కేసముద్రం : కేసముద్రంవిలేజ్‌కి చెందిన ఎండి.అజ్జు అనే భవన నిర్మాణ కార్మికుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ మేరకు స్పందించిన మారుతి ఐరన్ సిమెంట్ షాపు యజమాని బోనగిరి శ్రీధర్ బాధిత కుటుంబానికి రూ.5వేల నగదు గురువారం అందజేశారు.

విజయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..




కురవి : హరిదాసు తండాకు చెందిన ధరావత్ మంగమ్మ మృతి చెందడంతో గురువారం డోర్నకల్‌కు చెందిన విజయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మాలోత్ రామారావు స్పందించి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. బాధిత కుటుంబానికి సాయం అందజేయడంతో తండావాసులు రామారావును అభినందించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ.. పేదలకు సాయం అందజేయడంలో తృప్తి కలుగుతుందని తెలిపారు.

ధాన్యం, గడ్డి కట్టలు దగ్ధం

మరిపెడ రూరల్ : మరిపెడ మండలంలోని ధర్మాతండా పరిధిలో గుర్తుతెలియని వ్యక్తులు వరికొయ్య కాళ్లకు నిప్పుపెట్టడంతో రైతు బానోత్ సైదాకు చెందిన నాలుగు బస్తాల ధాన్యం కాలి బూడిదైంది. ఈ సందర్భంగా గురువారం బాధిత రైతు సైదా మాట్లాడుతూ ధాన్యం విక్రయించగా అవసరం కోసం నాలుగు బస్తాల ధాన్యం వ్యవసాయ క్షేత్రంలో ఆరబోసినట్లు తెలిపాడు. ధాన్యంతోపాటు 150 గడ్డికట్టలు పూర్తిగా కాలిపోయి బూడిదయ్యాయని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రస్తుతం తిండికి గింజ లేకుండా మంటల్లో దగ్ధమైందని కన్నీటి పర్యంత మయ్యాడు. ప్రభుత్వం ఆదుకోవాలని సైదా వేడుకున్నాడు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



కేసముద్రం : మండలంలోని కాట్రపల్లిలో కంఠ మహేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన, కల్యాణ మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి గోపా డివిజన్ అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్యగౌడ్ రూ.20,116ల విరాళాన్ని అందజేశారు. కల్లుగీత కార్మిక సంఘం సొసైటీ అధ్యక్షుడు పుట్ట ప్రభాకర్‌గౌడ్, బుర్ర భిక్షపతి, సాయిలు, యాకయ్య, వెంకన్న, రాజేష్, సుధాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎవరూ సమస్యలు సృష్టించొద్దు



మహబూబాబాద్ రూరల్ : గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ సర్వయ్య, ఎస్సై దీపికారెడ్డి

- రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై దీపికారెడ్డి

మహబూబాబాద్ రూరల్ : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎవరు కూడా సమస్యలను సృష్టించొద్దని రూరల్ సీఐ సర్వయ్య, రూరల్ ఎస్సై దీపికారెడ్డి సూచించారు. మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి గ్రామంలో గురువారం గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు, ఓటింగ్ జరిగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఎలాంటి గొడవలకు అవకాశం ఇవ్వొద్దని, ఏదైనా సమస్యగా అనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సంయమనం పాటించాలని పేర్కొన్నారు. పీసీలు రాజు, విజయ్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

తొర్రూరు : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై జగదీశ్ అన్నారు. నిబంధనలు పాటించకుండా రోడ్లపై నిలిపిన 20 ఆటోలను స్థానిక పోలీసులు సీజ్ చేసి గురువారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆటో డ్రైవర్లపై 283 ఐపీసీ సెక్షన్ కింద కేసులు నమోదు చేశారు. ట్రాఫిక్ నిబంధనలపై ఆటో డ్రైవర్లకు ఎస్సై అవగాహన కల్పించారు. రోడ్లపై వాహనాలు నిలిపితే ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ సాయికిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

జిజ్ఞాసలో రాష్ట్రస్థాయి ద్వితీయ బహుమతి



బహుమతులు అందుకున్న విద్యార్థులు

మహబూబాబాద్ అర్బన్ : రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన జిజ్ఞాస స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టులో నూకల రామచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర విభాగం విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రాజు గురువారం తెలిపారు. ఈనెల 1వతేదీన హైదరాబాద్‌లోని సోమాజిగూడలోని సంస్కృతీ రాజ్ భవన్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన అవార్డుల ప్రదానోత్సవంలో విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి బుర్రా వెంకటేశం చేతుల మీదుగా ప్రిన్సిపాల్ రాజు, ప్రాజెక్టు పర్యవేక్షకుడు, వృక్షశాస్త్ర సహ ఆచార్యులు డాక్టర్ తిరునహరి యుగంధర్, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు రూ.21వేల నగదు, ప్రశంసపత్రాలను అందజేశారు. జిజ్ఞాస సమన్వయకర్త మమత అధ్యాపకులు, విద్యార్థులను అభినందించారు.

కార్లు ఢీ.. ఇద్దరికి గాయాలు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి ఈదులపూసపల్లి రోడ్డులో రెండు కార్లు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్రగాయాలు కాగా మరొకరికి స్వల్ప గాయాలయ్యాయని రూరల్ ఎస్సై దీపికరెడ్డి గురువారం తెలిపారు. బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు వద్దిరాజు రాంచందర్ రావు కేసముద్రం నుంచి మహబూబాబాద్ వైపునకు తన కారులో వస్తున్నారు. ఖమ్మం నుంచి రషీద్ తన కారులో కుటుంబ సభ్యులతో కలిసి కేసముద్రం వెళ్తున్నారు. ఈదులపూసపల్లి రోడ్డులో రాళ్ల వాగు సమీపంలోకి రెండు కార్లు చేరుకుంటున్న క్రమంలో రషీద్ కారును రాంచందర్ రావు కారు ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాంచంద్రరావు రెండు కాళ్లకు తీవ్ర గాయాలు కాగా రషీద్ కారులోని ఒకరికి స్వల్ప గాయమైంది. రషీద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాంచందర్‌రావుపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

హజ్ యాత్రికులకు శిక్షణ



మరిపెడ సదస్సులో పాల్గొన్న హజ్ యాత్రికులు

మరిపెడ / మరిపెడ రూరల్ : ప్రతీ ఒక్కరు తమ జీవితంలో ఒక్కసారైనా హజ్ యాత్ర చేయాలని మదర్సా మౌలానా బది ఉజ్జమ అన్నారు. మరిపెడ మండలం కేంద్రంలోని అరేబియా ఇమ్మద్దులుం మదర్సాలో ఉజ్జమ ఆధ్వర్యంలో గురువారం హజ్ యాత్రికులకు శిక్షణ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇస్లాం ధర్మంలోని ఒక నియమం దైవ దర్శనం (మక్క మూనార్వ) దర్శించడం అనేది ఒక భాగమన్నారు. ఇస్లాం ధర్మం ప్రకారం నాలుగు ముఖ్యమైన అంశాలను నమాజ్, హజ్, రోజా, జకాత్ ప్రతీ ఒక్కరు పాటించాలన్నారు. 50 మంది హజ్ యాత్రికులకు పలు సలహాలు, సూచనలు చేశారు. జమమసీద్ సదర్ షేక్ రజ్జబ్ అలి, నయాబ్ సదర్ షేక్ జానీవియా, మొహమ్మద్ సబ్దర్, సయ్యద్ షానవాజ్, అవెజ్, షేక్ పాషా, మొహమ్మద్ జావిద్ ఖాన్, ఘని, వాలి, రహీమ్, యాదుల్ ఖురేషి, అఫ్రిద్, మౌలానా సయ్యద్, అబ్దుల్ కరీం, అఫ్జల్, అఫిజ్, అక్బర్, రియాజ్, అక్తర్‌పాషా పాల్గొన్నారు.

ఎండలోనూ తప్పని విధులు



డోర్నకల్ : డోర్నకల్ మున్సిపాలిటీ కార్మికులు తీవ్ర ఎండలోనూ విధులు నిర్వహిస్తున్నారు. నాలుగు రోజులుగా పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో వాటి పరిష్కారానికి కార్మికులు ఎండల్లో విధులు నిర్వహిస్తూ ఇబ్బందులు పడ్డారు. పెద్ద చెరువులోని బోరుబావి ద్వారా ఎస్సీ, బీసీ కాలనీ, సుభాష్‌వీధి తదితర ప్రాంతాలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. అయితే ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో పైపులైన్ పగలడం, గేట్‌వాల్వ్ మరమ్మతులకు గురికావడంతో రెండు రోజులుగా నీటి సరఫరా నిలిచింది. మున్సిపల్ కార్మికులు రెండు రోజులుగా తీవ్రమైన ఎండలో చెరువు సమీపంలో శ్రమించి నీటి సరఫరాను పునరుద్ధరించారు.

ఐకమత్యంతోనే పెరికల అభివృద్ధి



వీరయ్యను సన్మానిస్తున్న సంఘం నాయకులు

నెల్లికుదురు/నెహ్రూసెంటర్ : ఐకమత్యంతోనే పెరికల అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. కుల సంఘం ఆధ్వర్యంలో ఆయన నియామకంపై గురువారం ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ..పెరిక కార్పొరేషన్ ఏర్పాటు చేసి అభివృద్ధికి కృషి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. అనంతరం వీరయ్యను పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. సంఘం జిల్లా అధ్యక్షులు బందు సైదులు, జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చ శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ కోట మల్లికార్జున్, యగ్గడి రామకృష్ణ, అవిరే మోహన్‌రావు, నల్లపు వీరన్న, దశరథం, విజయ్‌కుమార్, ఆకుల రాజు, బుర్రి రవి, మహీధర్, వీరన్న, శ్రీను, శ్రీరాంకిరణ్, చంద్రశేఖర్, రాజేష్, కీలుశెట్టి శంకర్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

'సీతారాంనాయక్‌ను గెలిపించాలి'

దంతాలపల్లి : మహబూబాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థిగా అజ్మీరా సీతారాంనాయక్‌ను గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సందెల శ్రీనివాస్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనుల వద్ద కూలీలను కలిసి ప్రచారం చేశారు. మురళీ, అల్లం సాయికుమార్, సారెడ్డి రాణిరెడ్డి, చిన్నల ప్రవీణ్, నాగిరెడ్డి అనిల్, తదితరులు పాల్గొన్నారు.

సంతాపం

బయ్యారం : ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య తండ్రి పుల్లయ్య అనారోగ్యంతో మృతి చెందారు. కాగా కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, ఎంపీటీసీ సోమేష్ గురువారం సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు.

కుష్ఠును నివారించవచ్చు

దంతాలపల్లి : మండలకేంద్రంలోని ప్రజా వైద్యశాలలో గురువారం నిర్వహించిన కుష్ఠు వ్యాధి అనుమానిత వ్యక్తులకు పరీక్షలు నిర్వహించి ముగ్గురికి వ్యాధి ఉన్నట్లు డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ వనాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బహుళ ఔషధాలతో కుష్ఠు వ్యాధిని నివారించవచ్చని తెలిపారు. కార్యాక్రమంలో చైతన్య, బాలాజీ, కృష్ణ, రమణ పాల్గొన్నారు.

నేడు సీపీఐ ఎన్నికల సభ

నెహ్రూసెంటర్/ గార్ల: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) బలపర్చిన ఇండియా కూటమి అభ్యర్థి పోరిక బలరాంనాయక్ గెలుపును కాంక్షిస్తూ నేడు (శుక్రవారం) సీపీఐ ఆధ్వర్యంలో ఎన్నికల సభ నిర్వహిస్తున్నామని పార్టీ జిల్లా కార్యదర్శి బి.విజయసారథిరెడ్డి గురువారం తెలిపారు.

ఇచ్చిన హామీలు గుర్తు రాలేదా?

నెహ్రూసెంటర్ : పార్లమెంట్ ఎన్నికల్లో ప్రచారంలో భాగంగా మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్ మానుకోటకు ఇచ్చిన హామీలు కేసీఆర్‌కు కనిపించలేదా అని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథి రెడ్డి ప్రశ్నించారు.

ముమ్మరంగా ప్రచారం

డోర్నకల్ : కాంగ్రెస్, బీజేపీ నాయకులు గురువారం మండలంలోని పలు గ్రామాల్లో తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. డోర్నకల్, ఉయ్యాలవాడ, ముల్కలపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు పలు వీధుల్లో పర్యటించి కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్‌ను గెలిపించాలని ప్రచారం నిర్వహించగా, బీజేపీ నాయకులు డోర్నకల్‌తో పాటు గొల్లచర్లలో పర్యటించి తమ అభ్యర్థి సీతారాం నాయక్‌ను గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వివిధ కుల, ప్రజా సంఘాల, పార్టీల నాయకులు, కార్యకర్తలు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, ఎమ్మెల్యే మురళీనాయక్ పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానించారు.

క్రీడా మైదానానికి భూమి కేటాయించాలి

గార్ల : గార్లలో క్రీడా మైదానం ఏర్పాటుకు భూమి కేటాయించడంలో పాలకులు విఫలమయ్యారని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంపాల విశ్వ ఆరోపించారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చారిత్రక పోరాట కలిగిన గార్లలో క్రీడా మైదానం లేకపోవడం బాధాకరమన్నారు. క్రీడా మైదానం కోసం ఎంపీ, ఎమ్మెల్యేలకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి క్రీడామైదానం ఏర్పాటుకు ప్రభుత్వ భూమిని కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు.

గ్యారంటీలతో పేదలకు న్యాయం

కురవి : కాంగ్రెస్ పార్టీ గ్యారంటీ పథకాలు అమలు చేస్తుండడంతో పేదలకు న్యాయం జరుగుతోందని కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు నారాయణ రాజేందర్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఎంపీ అభ్యర్థి బలరాం నాయక్ గెలిపించాలని ఇంటింటి ప్రచారం చేశారు. తుకారం నాయక్, వీరన్న, భద్రయ్య, లక్ష్మయ్య, వీరన్న, నాగరాజు, వెంకన్న, లక్ష్మణ్‌నాయక్, వీరన్న, శ్రీనివాస్ ఉన్నారు.

భానుడి.. భగభగ

కురవి : మండల కేంద్రంలో గురువారం భానుడు భగభగమంటూ ప్రతాపాన్ని చూపాడు. 47 డిగ్రీల సెల్సియస్‌గా ఎండ వేడి చేరుకోవడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఎండవేడికి తోడు ఉక్క పోతతో జనం ఇబ్బంది పడ్డారు.

వివాహిత అదృశ్యం.. కేసు నమోదు

నెల్లికుదురు: వివాహిత అదృశ్యంపై గురువారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతికిరణ్ గురువారం తెలిపారు. ఇనుగుర్తి మండలం పెద్ద తండాకు చెందిన ధరావత్ రజిత గత నెల 25న ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఎక్కడ వెతికినా ఆచూకి లభించలేదు. రజిత తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అవగాహనతోనే ప్రమాదాల నివారణ



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

తొర్రూరు : అవగాహనతోనే విద్యుత్ ప్రమాదాలను నివారించవచ్చని విద్యుత్ శాఖ డీఈ మధుసూదన్ తెలిపారు. విద్యుత్ భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం డివిజన్ కేంద్రంలోని విద్యుత్ శాఖ సబ్ డివిజన్ కార్యాలయంలో సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తొర్రూరు, పెద్దవంగర, చిన్నవంగర సబ్ స్టేషన్ల విద్యుత్ సిబ్బందికి భద్రతా పరికరాలు అందించారు. డీఈ మాట్లాడుతూ.. విద్యుత్ ప్రమాదాల వల్ల ఏటా ఆస్తి, ప్రాణ నష్టాలు సంభవిస్తుంటాయని, అప్రమత్తతతో ప్రమాదాలను నివారించవచ్చన్నారు. అనుమతి లేకుండా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మరమ్మత్తులు చేయడం, తీగలు సరిచేయడం, సర్వీస్ వైర్లు మార్చడం వంటివి చేయరాదన్నారు. కార్యక్రమంలో ఎస్ఏఓ సంతోష్, ఏఈలు ఏడీ చలపతిరావు, ఏఈలు వంశీ, యాకయ్య, రమేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

మురళీకృష్ణ గెలుపునకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

బయ్యారం : మహబూబాబాద్ ఎంపీ స్థానం నుంచి ఎన్డీ అభ్యర్థిగా పోటీచేస్తున్న మోకాళ్ల మురళీకృష్ణ గెలుపునకు విప్లవనాయకులు కృషి చేయాలని ఎన్డీ కేంద్ర కమిటీ కార్యదర్శి సాధినేని వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం బయ్యారంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఎన్డీ(ఎస్.వి.వై.కే) వర్గాల ఉమ్మడి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పాలకవర్గ పార్టీలు పరోక్షంగా ఫాసిజానికి మద్దతు ఇస్తున్నాయని విప్లవ పార్టీ అభ్యర్థి గెలిస్తే ప్రజల తరుపున పోరాడుతారన్నారు. ఈ సమావేశంలో రెండువర్గాల జిల్లా కార్యదర్శులు గౌని ఐలయ్య, బండారి ఐలయ్య, నాయకులు సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, యాకన్న, నాగేశ్వరరావు, నర్సింహా, సమ్మయ్య, హోలీ, కొమరయ్య, కోటమ్మ, శంకర్, నారాయణ, మురళి, వెంకన్న, వీరభద్రం, రాకేష్ పాల్గొన్నారు.

హామీలు విస్మరించిన కాంగ్రెస్‌ను ఓడించండి

- మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్



కురవి: మాట్లాడుతున్న రెడ్యానాయక్

కురవి : పేదలకు ఇచ్చిన హామీలను విస్మరించిన కాంగ్రెస్ పార్టీని ఎంపీ ఎన్నికల్లో ఓడించాలని మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. గురువారం మండలంలోని నేరడ శివారు తండాలు, కురవి, అయ్యగారిపల్లి, మొగిలిచర్ల, తట్టుపల్లి, కొత్తురు (సీ) తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవితను గెలిపించాలని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌కు ఓటు వేసి ప్రజలు బాధపడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తోట లాలయ్య, పిచ్చిరెడ్డి, గుగులోత్‌రవినాయక్, అమిరిబాయి, కొణతం విజయ్, నూతక్కి నర్సింహారావు, సాంబశివరావు, బాదావత్ రాజునాయక్, గుడిబోయిన రాంచంద్రయ్య, గణేష్ పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారం

మహబూబాబాద్ రూరల్ : పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత గెలుపునకు మహబూబాబాద్ పురపాలక సంఘం 24వ వార్డు పరిధిలోని ముత్యాలమ్మ తల్లికి పూజలు నిర్వహించి గురువారం ఇంటింటా ప్రచారం ప్రారంభించారు. స్థానిక వార్డు కౌన్సిలర్, మున్సిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచారంలో ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర మహిళా నాయకురాలు కటికనేని హరిత, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు మహబూబ్ పాషా, ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత కుమార్తె మాలోత్ మహతి, పిట్టల గోపాల్, మార్నేని కిరణ్, గుగ్రాల శీను, వద్ది నాగయ్య, మంద అర్జున్, తుడుం నాగరాజు, మంద మురళి, పంజా కుమార్, పంజా సుమన్, దుంప పరశురాములు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

'శర పంజరం' ఆదరణ మరువలేనిది

తొర్రూరు : చిత్రపరిశ్రమలో చిరస్థాయిగా నిలిచేలా శర పంజరం చిత్రం రూపొందిందని, ఈ చిత్రానికి వచ్చిన ఆదరణ మరువలేనిదని కథానాయకుడు గట్టునవీన్ అన్నారు. స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం శరపంజరం లయ కథానాయక, జబర్దస్త్ వెంకీ, జీవన్, రాజమౌళి, ఆనంద్‌భారతి, వరంగల్ బాషా, మేరుగు మల్లేశం, అలువాల సోమయ్య ప్రధాన పాత్ర పోషించారు. టి.తిరుపతి రెడ్డి నిర్మాత, మల్లిక్ ఎం వికె స్వరాలు సమకూర్చారు. ఈ చిత్రం రెండు వారాలనుంచి విజయవంతంగా ఆయా థియేటర్లలో ప్రదర్శితమతున్న తరుణంలో గురువారం డివిజన్ కేంద్రంలో ఏసియన్ రామకృష్ణ థియేటర్లో సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ చిత్రానికి గొప్ప విజయాన్ని అందించిన ప్రేక్షకులకు దర్శకుడు నవీన్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ.. తెలంగాణలో గంగిరెద్దుల వారి జీవనం, జోగిని వ్యవస్థల ఆధారంగా చిత్రం రూపొందిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో హిరోయిన్ లయా, జబర్దస్త్ వెంకి, రాజమౌళి,జీవన్,నటులు మేరుగు మల్లేశంగౌడ్, లువాల సోమయ్య,కెమరమేన్ మస్తాన్, సిరిపాటి, మ్యాజిక్ కళ్యాణ్, పెద్దవంగర వాసవి క్లబ్ అధ్యక్షులు మాలే మోహన్‌రావు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.

ఎంపీగా బలరాం నాయక్‌ను గెలిపించాలి

- ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్



ఎల్లంపేటలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

మరిపెడ రూరల్ /చిన్నగూడూరు : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన మహబూబాబాద్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్ కార్యకర్తలను కోరారు. మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా బలరాం నాయక్ గెలుపును అభ్యర్థిస్తూ మరిపెడ మండలం వీరారం గ్రామపంచాయతీ పరిధిలోని కేలోతుతండా, జీన్యతండా, ఎల్లంపేట గ్రామాల్లో, చిన్నగూడూరు మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గురువారం ఎమ్మెల్యే పర్యటిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఉపాధి కూలీలు పని చేస్తున్న ప్రదేశాలకు వెళ్లి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. అనంతరం ఎల్లంపేటలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ద్వారానే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీర్‌రెడ్డి, ఆర్టీఐ మాజీ కమిషనర్ శంకర్‌నాయక్, నాయకులు కమలాకర్, కొండం దశరథ, గండి వీరభద్రం, బుర్ర నవీన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

బలరాంనాయక్ గెలుపు ఖాయం

గూడూరు/నెల్లికుదురు/ కేసముద్రం : మానుకోట ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ గెలుపు ఖాయమని ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ ధీమా వ్యక్తం చేశారు. మానుకోట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం గూడూరు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొల్లికొండ మధుగౌడ్ ఆధ్వర్యంలో పానుగోడుకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిట్టి వెంకన్న, ఎడ్ల నరేష్‌రెడ్డి, పానుగోడు నాయకులు కర్రె వీరయ్య, జానీపాష, బెజ్జం రమేష్, చంద్రశేఖర్, కర్రె యాకయ్య, సుధాకర్, పురుషోత్తం పాల్గొన్నారు. అలాగే ఇనుగుర్తి మండలంలోని చిన్నముప్పారంలో గురువారం స్థానిక నాయకులతో కలసి ఎమ్మెల్యే పార్లమెంట్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీల వద్ద మట్టి మోసి ఎమ్మెల్యే మాట్లాడారు. అదే విధంగా కేసముద్రం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇచ్చిన మాట ప్రకారంగా సీఎం రేవంత్‌రెడ్డి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టాడన్నారు. రాహుల్‌గాంధీని ప్రధాని చేస్తే దేశం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు.



నెల్లికుదురు: చిన్నముప్పారంలో..

ఉపాధి హామీ పనుల వద్ద ప్రచారం..

గూడూరు : ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది కాంగ్రెస్ పార్టీ అని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి స్వామి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ వేం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తీగలవేణిలో చేపట్టిన ఉపాధి హామీ పనుల వద్ద గురువారం బ్లాక్ కాంగ్రెస్ నాయకులు బలరాంనాయక్ గెలిపించాలని కోరారు.

బలరాంనాయక్‌ను గెలిపించాలి

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ గెలిపించాలని పట్టణంలోని 16 వార్డులో గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ అర్బన్ అధ్యక్షుడు ఘణపురపు అంజయ్య, బండారి చిరంజీవి, గాంధీ వీరన్న, గఫార్, రాంజీ, విజయ్, వద్ది నగేష్ పాల్గొన్నారు.

వృథాగా మిషన్ భగీరథ నీరు



గార్ల : జీవంజిపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీతో తమకు తాగునీరు అందడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ పైపులైన్ నిర్మాణం చేపట్టిన సమయంలో కాంట్రాక్టర్ నాసిరకం పైపులు వేయడం వల్ల పైపులు పగిలిపోయి లీకేజీ సమస్య ఏర్పడుతోందన్నారు. 10 రోజుల క్రితమే పైపులైన్ పగలడంతో మరమ్మతులు చేశారని, మళ్లీ పగిలిపోవడంతో గ్రామంలో ప్రజలకు తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేపట్టి తాగునీటి సమస్యను తీర్చాలని గ్రామస్తులు కోరారు.